సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



పేదలకు సంక్షేమ పథకాలు
ప్రభుత్వం పేద వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు.
- 8లో



దర్శనానికి 3గంటలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది.
- 10లో

గరిష్టం/కనిష్టం
36°/23°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

రైతు కష్టం వర్షార్పణం

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కొన్ని చోట్ల కొట్టుకుపోయిన వడ్లు
- నేలవాలిన వరి చేలు
- కూలిన విద్యుత్ స్తంభాలు.. కరెంట్ సరఫరాకు అంతరాయం



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కుప్పల మధ్య నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

సాక్షి నెట్‌వర్క్ : అకాల వర్షం మరోసారి రైతులను ఇబ్బందుల పాలు చేసింది. ఆదివారం జిల్లాలోని ఏడు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల కోత దశలో ఉన్న వరి పొలాల్లో వడ్లు నేలరాలాయి.

మండలాల వారీగా నష్టం ఇలా..

❖ **చౌటుప్పల్** : వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశుల కిందికి నీరు చేరడంతో తడిసి ముద్దయ్యింది. ఆరబోసిన వడ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి.

❖ **అడ్డగూడూరు** : మండలంలోని ధర్మారం – లక్ష్మీదేవికాల్వ గ్రామాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు, ఎనిమిది స్తంభాలు కూలిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధర్మారంలో కోత దశలో ఉన్న వరి పొలాలను నేలకొరిగాయి. సిగిల్‌విండో, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిశాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా తంటాలు పడ్డారు.

❖ **మోత్కూరు** : మండలంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి పొడిచేడు, అనాజిపురం, పాటిమట్ల, మోత్కూరు గ్రామాల్లోని ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడిసింది.

❖ **భూదాన్‌పోచంపల్లి** : ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చింతబావిలో ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. దోతిగూడెంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం పాక్షికంగా తడిసింది.

❖ **గుండాల** : మండల కేంద్రంలో రైతులు బండమీద ఆరబోసిన ధాన్యం పూర్తిగా కొట్టుకుపోయి రామసముంద్రం చెరువులోకి చేరింది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లోనూ ధాన్యం తడిసి ముద్దయ్యింది.



మోత్కూరు: దాచారంలో తడిసిన ధాన్యం

❖ **మోట కొండూర్**: మాటూర్, అమ్మనబోలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడవడంతో పాటు కొందరి వడ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి.



చౌటుప్పల్: నీటిలో నుంచి ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళలు



అడ్డగూడూరు: ధర్మారంలో కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



గుండాల : తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 25న నిర్వహించే నియోజకవర్గ స్థాయి ప్లీనరీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 25న నియోజకవర్గవ్యాప్తంగా ఉదయం 8 గంటలకు బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

యువజన విభాగం కీలకం

పార్టీకి యువజన విభాగం అత్యంత కీలకమని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన భువనగిరి మండల యువజన విభాగ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్‌కు యువజన విభాగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు జనగాం పాండు, పార్టీ యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత చట్టాన్ని పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

యాదగిరిగుట్ట: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలను బీజేపీ ప్రభుత్వం పెంచడంతో పేదలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు కార్పొరేట్ సంస్థలకు రూ.15లక్షల కోట్లను రాయితీలు ఇచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమ, మంగళవారాల్లో జరిగే ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాల్లో మహిళ సమస్యలపై చర్చించి, ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు బట్టుపల్లి అనురాధ పాల్గొన్నారు.

బిక్కేరు వాగు నుంచి ఇసుకను తరలించొద్దు



సమావేశంలో పాల్గొన్న రైతులు

గుండాల: మండలంలోని పెద్దపడిశాల గ్రామం బిక్కేరు వాగు నుంచి ఇసుకను తరలించొద్దని రైతులు ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో బిక్కేరు వాగులో ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు అడుగంటి పోయి బావులు, బోర్లు వట్టిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈమేరకు బిక్కేరు వాగు పక్కన గల రైతులు సమావేశమై ఇసుక తీయవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతను కోరారు. వారిలో సత్యనారాయణ, సోమయ్య, ఖలీల్, శేఖర్, మధు, బాలయ్య, ఎల్లయ్య, అడ్వకేట్ యుగేందర్ ఉన్నారు.

గురుకుల పరీక్షకు 2,229 మంది హాజరు

భువనగిరి: 2023– 24 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. మొత్తం 2,229 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,071 మంది హాజరయ్యారు. 158 మంది గైర్హాజరయ్యారు. ఇందులో బాలురు 64 మంది, బాలికలు 84 మంది ఉన్నారు.

యాదాద్రి క్షేత్రంలో ధరల బోర్డుల ఏర్పాటు

- లగేజీ కౌంటర్ వద్ద సిబ్బంది నియామకం
- అధిక ధరలు తీసుకోవద్దని వ్యాపారులకు హెచ్చరిక
- 'సాక్షి' కథనాలతో కదిలిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో కొబ్బరికాయలు, కొండ కింద వాటర్ బాటిల్స్ అధిక ధరలు అమ్ముతుండడం, చెప్పుల స్టాండ్, లగేజీ కౌంటర్‌లో వద్ద అధికంగా వసూలు చేస్తుండడంతో 'టెండర్ లేకుండానే లగేజీ కౌంటర్', 'నారసింహా.. ఇదేం దోపిడీ' శీర్షికన 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. ఈమేరకు ఆలయ అధికారులు స్పందించారు. ఆదివారం లగేజీ కౌంటర్ వద్ద దేవస్థానం సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి బ్యాగ్‌కు రూ.5 వసూలు చేసి రశీదు ఇవ్వడంతో పాటు చెప్పుల స్టాండ్ వద్ద పాదరక్షలు భద్రపరిచే స్థలంలో భక్తులు జతకు రూ.2 చెల్లించాలని బోర్డులు ఏర్పాటు చేశారు. కొండపైన ప్రచార శాఖ నుంచి సైతం అధిక ధరలు తీసుకోవద్దని వ్యాపారస్థులను హెచ్చరిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. పలువురు దుకాణాదారులు, వ్యాపారస్థులు, టెండర్‌దారులకు నోటీసులు సైతం జారీ చేశారు.



కొండపైన లగేజీలకు వేసిన స్టిక్కర్లను పరిశీలిస్తున్న దేవస్థానం సిబ్బంది



చెప్పుల స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన స్టిక్కర్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆలేరురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాంతం అణగారిన వర్గాలకోసం పోరాడి, వారికి ఆశాజ్యోతిగా నిలిచారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలేరు మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలో నిర్వహించిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అవిశ్రాంత కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో రోడ్ల మంజూరు కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రిని కలిసి అడుగుతున్నామని తెలిపారు. అనంతరం పటేల్‌గూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చెప్పగా.. కలెక్టర్‌కు ఫోన్ చేసి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య, సర్పంచ్ పులగం పద్మాయాదిరెడ్డి, ఎంపీటీసీ ప్రశాంత్, దశరథ, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు



సేవా కాలం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆదివారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం నిర్వహించిన అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం జరిపించారు. సహస్ర నామార్చన విశేషంగా చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు విశేషంగా నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో చేపట్టిన వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

రామానుజుల తిరునక్షత్ర వేడుకలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీరామానుజుల తిరునక్షత్ర వేడుకలకు ఆచార్యులు పాంచరాత్ర ఆగమశాస్త్ర రీతిలో శ్రీకారం చుట్టారు. ఆలయ ముఖ మండపంలో కొలువై ఉన్న భగవత్ రామానుజుల విగ్రహం వద్ద ఆలయ ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు సేవ కాలం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే రామానుజుల తిరునక్షత్ర ఉత్సవాల్లో చివరి రోజు సాయంత్రం భోగాలు చేపట్టి, సేవాకాలం నిర్వహించి వేడుకలను ముగిస్తారు.

కలల బ్రిడ్జి పూర్తయింది

- సుద్దాల పెద్దవాగుపై పూర్తయిన వంతెన కమ్ చెక్‌డ్యామ్
- జనగామ జిల్లాకు తగ్గనున్న దూరభారం
- మోత్కూరు, ఆత్మకూరు(ఎం), వలిగొండ మండలాలకు ప్రయోజనం
- త్వరలో అందుబాటులోకి

ఆత్మకూరు(ఎం): జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలను కలిపే బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్ పూర్తి కావొచ్చింది. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్‌–పారుపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి సుద్దాల మధ్య పెద్ద వాగుపై ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జికి ఇరువైపులా సుద్దాల– పల్లెపహాడ్– పారుపల్లి ఎక్స్‌రోడ్డు వరకు కిలోమీటరు మేర బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాగా.. బ్రిడ్జి నిర్మాణానికి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్‌ఆర్‌బీ పథకం కింద ప్రభుత్వం రూ. 9.75కోట్ల నిధులను మంజూరు చేయగా.. 2022లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

బ్రిడ్జి పూర్తికావడంతో..

సుద్దాల పెద్దవాగు సుమారు 220 మీటర్లు ఉంటుంది. వాగు అవతల సుద్దాల గ్రామం ఉంటుంది. వాగు ఇవతలి వైపు ఆ గ్రామస్తుల వ్యవసాయ బావులు ఉన్నాయి. వాగు ప్రవహించినప్పుడు రైతులు ఇబ్బందులు పడేవారు. అంతే కాకుండా జనగాం వెళ్లాలంటే అటు భువనగిరి నుంచి ఇటు మోత్కూరు నుంచి తిరిగి పోవాల్సి వస్తుండేది. ఇప్పుడు బ్రిడ్జి పూర్తి కావడంతో ఈ సమస్యలు లేకుండా పోయాయి.



పూర్తయిన బ్రిడ్జి

తగ్గనున్న దూరం..

పల్లెపహాడ్– పారుపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి సుద్దాల మధ్య పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో దూర భారం తగ్గనుంది. ఆత్మకూరు(ఎం) మండలంతో పాటు వలిగొండ మండలం నర్సాపురం, దుప్పెల్లి గ్రామస్తులు భువనగిరి మీదుగా జనగాం వెళ్లాలంటే 76 కిలోమీటర్లు వస్తుంది. మోత్కూరు మీదుగా 66 కిలోమీటర్లు వస్తుంది. సుద్దాల వాగు మీదుగా జనగాం వెళ్తే 40కిలోమీటర్ల దూరం మాత్రమే వస్తుంది. మోత్కూరు, వలిగొండ, ఆత్మకూరు(ఎం) మండలాల ప్రజలకు సగం దూరం తగ్గుతుండటంతో బ్రిడ్జితో పాటు రోడ్డు ప్రధానంగా కీలకం కానుంది.

చిన్నచిన్న పనులు పూర్తికావాల్సి ఉంది



సుద్దాల పెద్దవాగు బ్రిడ్జి విషయంపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించా. చిన్నచిన్న పనులు ఉన్నాయి. అవి పూర్తి కాగానే అందుబాటులోకి తీసుకువస్తాం.
– గొంగిడి సునీత, ప్రభుత్వ విప్

దూర భారం తగ్గుతుంది



నర్సాపురం, కూరెల్ల, రాఘవాపురం, దుప్పెల్లి, పల్లెర్ల, పారుపల్లి, పల్లెపహాడ్‌తో పాటు మోత్కూరు మండలం నుంచి కూడా వ్యాపార నిమిత్తం, వ్యవసాయ మార్కెట్ నిమిత్తం జనగాం వెళ్తుంటారు. చాలా దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు బ్రిడ్జి పూర్తి కావడంతో సగం దూరం తగ్గుతుంది.
– ఉప్పలయ్య యాదవ్, సర్పంచ్ కూరెల్ల, ఆత్మకూరు(ఎం)

వాడుతున్న వనాలు!

- పల్లె ప్రకృతివనాల్లో ఎండిపోతున్న మొక్కలు
- మల్టీపర్పస్ వర్కర్లకు సకాలంలో అందని వేతనాలు
- పలుచోట్ల మొక్కలకు నీళ్లు పోయని కార్మికులు
- నిధుల విడుదలలో జాప్యంతో వనాల నిర్వహణ పట్టించుకోని సర్పంచ్‌లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండిన 10 శాతం వనాలు



ఈ ఫొటో ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో పల్లె ప్రకృతి వనం. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రకృతి వనం మొత్తం గడ్డిమయంగా మారింది. నీళ్లు సరిగ్గా పోయకపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి. మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ప్రకృతి వనాల నిర్వహణను గాలికొదిలేశారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోతున్నాయి.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు వాడుపడుతున్నాయి. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. మరికొన్ని చోట్ల వనాలను గుట్టల్లో ఏర్పాటు చేయడంతో నీళ్లు పోసే పరిస్థితి లేకుండా పోయింది. చాలా చోట్ల కార్మికులకు నెలల తరబడి వేతనాలను ఇవ్వకపోవడంతో వారు మొక్కలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాల నుంచి నిధులు కూడా సకాలంలో అందకపోవడంతో సర్పంచ్‌లు కూడా మొక్కల నిర్వహణ వదిలేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాలు వాడుముఖం పట్టాయి.

ఎండిపోయిన 10 శాతం వనాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో 2,539 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. మొక్కలకు నీరు పోసేందుకు గ్రామాల్లో ట్యాంకర్లు ఉన్నాయి. మల్టీపర్పస్ వర్కర్లు కూడా ఉన్నారు. వారానికి రెండుసార్లు మొక్కలకు నీళ్లు పోయాలని అధికారులు చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులను అధికారులు ఏమీ అనలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 శాతం వరకు పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయాయి.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	పంచాయతీలు	వనాలు	వర్కర్లు
నల్లగొండ	844	1439	2964
సూర్యాపేట	475	679	1762
యాదాద్రి	421	421	1875

మూడు నెలలుగా వేతనాల్లేక ఇబ్బందులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మల్టీపర్పస్ వర్కర్లు 6,601 మంది ఉన్నారు. ఒక్కొక్కరి నెలకు రూ.8500 చొప్పున నెలకు రూ.5,61,8,500 వేతనాలు ఇవ్వాల్సి ఉంది. అయితే కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదు. అంటే కార్మికులందరికీ మూడు నెలల వేతనం లెక్కించినా రూ.16,83,25,500 బకాయి రావాల్సి ఉంది. దీంతో వారు వేతనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్ర నిధుల నుంచి వేతనాలు ఇవ్వని సర్పంచ్‌లు

కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచే వేతనాలు ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశించినా అనేక మంది సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదు. కేంద్ర నిధుల నుంచి కాకుండా రాష్ట్రం నిధులు విడుదల చేసినప్పుడే కార్మికులకు వేతనాలు ఇస్తున్నాయి. కేంద్రం ఇచ్చిన నిధులను డీటీఓతో సంబంధం లేకుండా డ్రా చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర నిధులైతే ట్రెజరీలో చెక్ పాస్ కావాల్సి ఉంటుంది. వాటిపై ఫ్రీజింగ్ ఉండడంతో నెలల తరబడి పెండింగ్ ఉంటున్నాయి. దీంతో సర్పంచ్‌లు కేంద్ర నిధుల నుంచి వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదు. గ్రామంలో చేసిన పనులకు అయిన మొత్తాన్ని ఆ నిధులనుంచి డ్రా చేసుకుంటున్నారు.

కొన్ని మండలాల్లో ఇదీ పరిస్థితి

❖ ఆలేరు మండలం మంతపురి, తూర్పుగూడెం, గొలనుకొండ, శ్రీనివాస్‌పురం, శారాజీపేట, కందిగడ్డతండాలో నీళ్లు పోయకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

❖ డిండి మండలంలోని 38 గ్రామాల్లో వనాలను ఏర్పాటు చేసినా నిర్వహణ లేక అందులో సగం దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో అడవులు, గుట్టల్లో ఏర్పాటు చేయడంతో నాటిన మొక్కలకు నీరు పోయడానికి వాటర్ ట్యాంకర్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

❖ తిప్పర్తి మండలం కంకణాలపల్లిలో 20 గుంటల స్థలంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటినా చౌడు భూమి కావడంతో మొక్కలు పెరగడం లేదు. ఇండ్లూరు గ్రామంలో అదే పరిస్థితి నెలకొంది. మరోవైపు నీరు కూడా పోయకపోవడంతో దెబ్బతింటున్నాయి. వెంకటాద్రిపాలెంలోని పల్లె ప్రకృతి వనంలో కూడా ఎదిగిన చెట్లు ఎండిపోయాయి.

వేతనాలు రావడం లేదు



నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదు. పూట గడవడం కష్టంగా ఉంది. ఐదారు నెలలకు ఒకసారి వేతనం వస్తే అది వడ్డీలకే సరిపోతోంది. పిల్లల చదువులకు ఇబ్బంది అవుతోంది. ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలి.
– రాజు, కార్మికుడు, చొప్పరివారిగూడెం, చండూరు మండలం

టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు



టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్: మండలంలోని జాతీయ రహదారిలో గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు బారులుదీరాయి. రెండు రోజులు సెలవులు రావడం, ఆదివారం శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతోపాటు యాదాద్రి క్షేత్రానికి భక్తులు జంట నగరాల నుంచి భారీగా తరలి వచ్చారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన నరేందర్‌గౌడ్

గుండాల : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొన్నగాని నరేందర్ ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడటంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన తోటి కార్మికులు బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కల్తీపాలు స్వాధీనం


నిందితుడు, కల్తీపాల క్యాన్లు

భూదాన్‌పోచంపల్లి : ఎస్‌ఓటీ పోలీసులు ఓ ఇంటిపై దాడి చేసి కల్తీపాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని భీమనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కందాల బుచ్చిరెడ్డి పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుచ్చిరెడ్డి పాలను కల్తీ చేసి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. అయితే, విశ్వసనీయ సమాచారం మేరకు ఉదయం ఎస్‌ఓటీ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 110 లీటర్ల కల్తీపాలు, 100 మిల్లీ లీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 3 కిలోల స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

లిఫ్ట్ వైర్ తెగి రైస్‌మిల్లు డ్రైవర్ మృతి


మృతి చెందిన చంద్రశేఖర్

మిర్యాలగూడ టౌన్ : లిఫ్ట్ వైర్ తెగి ప్రమాదవశాత్తు కిందపడి రైస్‌మిల్లు డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని యాద్గార్‌పల్లి సూర్య రైస్‌మిల్లు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కోల చంద్రశేఖర్(21) గ్రామ సమీపంలోని సూర్య రైస్‌మిల్లులో ప్లాంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోప్ ద్వారా పైన మరమ్మతులను చేసేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ వైర్ తెగింది. దీంతో లిఫ్ట్‌లో ఉన్న చంద్రశేఖర్ పైనుంచి కిందపడి పోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రైస్‌మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంతోనే చంద్రశేఖర్ మృతి చెందాడని మృతుడి బంధువులు మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సత్యనారాయణ బందోబస్తును ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుండా చూశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

చెకింగ్ లేని చెక్‌పోస్ట్ !

- కాసులిస్తే అంతా కరెక్టే..
- లంచాల సొమ్ముతో నెలవారీ మామూళ్లు


నల్లబండగూడెం వద్ద ఉన్న తెలంగాణ - ఆంధ్ర సరిహద్దు రవాణా చెక్‌పోస్ట్

కోదాడ: రోడ్డు మార్గంలో జరిగే అక్రమ రవాణాకు చెక్ పెట్టడానికి ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టు అక్రమాలకు కేరాఫ్‌గా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాసులిస్తే ఇక్కడ అంతా కరెక్ట్‌గానే ఉంటుందని, ఎలాంటి వాహనానికైనా, ఏ సరుకుకైనా ఇక్కడి అధికారులు రైట్ చెబుతారని వాహనదారులే అంటున్నారు. మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 16 ఇసుక లారీలు ఎలాంటి అనుమతులు లేకున్నా ఈ చెక్‌పోస్ట్ దాటి రావడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దొరికితేనే దొంగ అన్నచందంగా వ్యవహారం నడుస్తుందని పలువురు అంటున్నారు. తెలంగాణ-ఆంధ్ర సరిహద్దులో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లబండగూడేనికి సమీపంలో ఉన్న సరిహద్దు చెక్‌పోస్ట్‌లో రోజువారీ వసూళ్లు లక్షల్లో ఉంటాయనేది బహిరంగ రహస్యమే. తమ బండారం బయటకు పొక్కకుండా వీరందరినీ మేనేజ్ చేస్తుంటారు. అధికారుల కనుసన్నల్లో కింది స్థాయి సిబ్బంది 24 గంటలు తమ దందా కొనసాగిస్తుంటారని పలువురు అంటున్నారు.

అక్రమార్కులే వీరికి బంగారు బాతులు

అక్రమదందా చేసే వారే వీరికి బంగారు బాతులుగా ఉంటారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కాకినాడకు రేషన్ బియ్యం రవాణా చేసే లారీలు, ఆంధ్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను రవాణా చేసే వాహనాలు, ఆంధ్ర నుంచి తెలంగాణకు ఇసుకు రవాణా చేసే లారీలు, అధికలోడ్‌తో వెళ్లే సిమెంట్ లారీలు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, పర్మిట్ తీరిపోయిన వాహనాల నుంచి వేల రూపాయల్లో వసూళ్లు చేస్తుంటారని పలువురు అంటున్నారు. కోదాడ నుంచి రేషన్ బియ్యాన్ని ఈ చెక్‌పోస్ట్ దాటించడానికి కొందరు ఏజెంట్లుగా మారి చెక్‌పోస్టు సిబ్బందికి భారీగా ముట్టజెపుతున్నారని సమాచారం. ఇక అన్నీ సక్రమంగా ఉన్న వాహనదారులు కూడా నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించాల్సిందే. లేకపోతే లేనిపోని కొర్రీలు పెట్టి ఇబ్బంది పెడతారని డ్రైవర్లు అంటున్నారు. మూడు రోజుల క్రితం ఈ చెక్‌పోస్ట్‌ను దాటుకొని 16 ఇసుక లారీలు తెలంగాణలోకి ప్రవేశించడం అవి కేతేపల్లి, చౌటుప్పల్ వద్ద పోలీసులకు పట్టుబడడం తెలిసిందే. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ఇసుక లారీలు ఈ చెక్‌పోస్టును దాటుకొని యథేచ్ఛగా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించడం వెనుక అధికారుల కాసుల కక్కుర్తి ఉందని సమాచారం.

టంచన్‌గా నెలవారీ మామూళ్లు..

లంచాల రూపంలో నిత్యం వసూళ్లు చేస్తున్న లక్షల రూపాయలను నెల రోజుల తరువాత ఒక దగ్గరకు చేర్చి పంపకాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి ఓ అధికారి బాధ్యతలు తీసుకుంటున్నట్లు సమాచారం. తాము చేసే దందా బయట పడకుండా అన్ని వర్గాల వారికి ప్రతి నెలా మొదటి వారంలోనే మామూళ్ల పంపిణీ చేస్తుంటారని, దీంతో చెక్‌పోస్ట్‌లో జరిగే దందాకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని పలువురు అంటున్నారు. గడిచిన 7 సంవత్సరాల కాలంలో ఈ రవాణా చెక్‌పోస్టులో మాత్రం ఒక్క అక్రమ రవాణా వాహనం పట్టుబడలేదు. దీన్ని బట్టే ఇక్కడ చెకింగ్ ఏమాత్రం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పోలీసులదీ అదే దారి...

ఆంధ్ర- తెలంగాణ సరిహద్దుకు మూడు కిలోమీటర్ల దూరంలో చెక్‌పోస్ట్ ఉంటుంది. ఈ చెక్‌పోస్ట్‌ను తప్పించుకోవడానికి కొంత మంది అక్రమార్కులు ఏపీ నుంచి తెలంగాణలోకి ప్రవేశించగానే రామాపురం క్రాస్ రోడ్డు ఉంటుంది. ఇక్కడ నుంచి లారీలు రెడ్లకుంట నుంచి కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుకొని అక్కడి నుంచి హైద్రాబాద్‌కు వెళుతున్నాయి. మరో మార్గంలో ఆంధ్రలోని జగ్గయ్యపేట, బలుసుపాడు, అన్నారం మీదుగా తెలంగాణలోని రెడ్లకుంటకు చేరుకొని అక్కడ నుంచి కాపుగల్లు, గుడిబండ మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుతున్నాయి. ఇది కోదాడ రూరల్‌పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటుంది. ఈ మార్గంలో జరిగే అక్రమ రవాణాను అరికట్టడంలో రూరల్ పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కోదాడకు చెందిన ఇద్దరు వ్యాపారులు ఈ మార్గంలో లారీలను రప్పించి కోదాడలో ఇసుక అమ్మకాలు చేస్తున్నారని, వీరికి రూరల్ పోలీసులతో పాటు పట్టణ పోలీసుల సహాయసహకారాలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలున్నాయి.

పకడ్బందీ చెకింగ్ లేకనే..

సంవత్సరం క్రితం తెలంగాణ- ఏపీ సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. వందల కిలోల గంజాయిని నిత్యంపట్టుకొనే వారు. ఆ తరువాత క్రమంగా ఈ చెక్‌పోస్టులో తనిఖీలు నామమాత్రంగా మారింది. ఇటీవల వారం పరిధిలో రెండుసార్లు కోదాడ పోలీస్‌లు ఇక్కడ కట్టడి-ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న 80 లేగదూడల లారీ, నల్లబెల్లం లారీ, 117 కేజీల గంజాయి వాహనం పట్టుబడ్డాయి. రెండు రోజుల్లోనే మూడు వాహనాలు పట్టుబడ్డాయి అంటే అక్రమ రవాణ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ నిత్యం పకడ్బందీగా చెక్‌పోస్ట్ నిర్వహిస్తే అక్రమార్కులకు చెక్ పెట్టవచ్చని పలువురు అంటున్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం



తెలంగాణ-ఆంధ్ర సరిహద్దులో అక్రమ రవాణ జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటాము. పోలీస్ చెక్‌పోస్టును మరింత పటిష్టం చేస్తాము. అక్రమార్కులను ఉక్కుపాదంతో అణిచివేస్తాము. కోదాడ మండలంలోని గ్రామాల నుంచి ఇసుక లారీలు వెళితే వెంటనే సీజ చేస్తాము. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాము.

– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా

- దేవరకొండలో విషాదం


జ్యోతి మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి


మృతుడు నాగరాజు (ఫైల్)


నిలా జ్యోతి (ఫైల్)

దేవరకొండ : సరదా కోసం బావిలోకి ఈతకు వెళ్లి ఓ యువతి, యువకుడు నీట మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన దేవరకొండ పట్టణంలోని సంజయ్‌కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌కాలనీకి చెందిన నిలా జ్యోతి(13), సందెగళ్ల నాగరాజు(27) సమీపంలోని పీర్లబావి వద్దకు ఈతకు వెళ్లారు. వారు ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగారు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన బావిలోకి దూకి జ్యోతి, నాగరాజులకు బయటకు తీశారు. వెంటనే వారికి సీపీఆర్ చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు జ్యోతి తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందాడు. 8వ తరగతి వరకు చదివిన జ్యోతి తన నాయినమ్మ రాములమ్మతో కలిసి కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచేది. నాగరాజు మేస్త్రి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒకే కాలనీకి చెందిన ఇద్దరు మృత్యువాతపడడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు పీర్ల బావి వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. ఆస్పత్రిలో మృతుల బంధువుల రోధనలు పలువురిని కంటతడిపెట్టించాయి. మృతురాలు జ్యోతి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సుధీర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


పొలంలో పడిఉన్న లింగయ్య మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రం శివారులో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల గ్రామానికి చెందిన కోడి లింగయ్య (45) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా లింగయ్య మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో ఘర్షణ పడుతున్నాడు. మూడు రోజుల క్రితం లింగయ్య ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన స్థానిక రైతులు కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లింగయ్య మృతదేహంగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఏడుగురికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్ : టాటాఏస్ వాహనాన్ని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఏడుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఎల్లంబావి గ్రామశివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై విలేజ్ ఆహారం హోటల్ సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటాక చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన యువకులు ఈవెంట్స్ ఆర్గనైజ్ చేస్తుంటారు. అందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో జరిగిన కంఠమహేశ్వర స్వామి బోనాల వేడుకలను పురస్కరించుకొని మాధవ్‌బ్యాండ్ తరుపున 18మంది యువకులు శనివారం మధ్యాహ్నం వచ్చారు. వేడుకలు ముగిశాక అర్ధరాత్రి తిరుగు ప్రయణమయ్యారు. ఆ క్రమంలో విలేజ్ ఆహారం హోటల్ వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో టాటాఏస్ వాహనం పల్టీకొట్టి ఆటోలో ఉన్న యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కామినేని, గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ సీత పాండు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మందడి ఉదయ్‌కిరణ్‌రెడ్డి మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వస్తున్న టాటాఏస్ వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రం శివారులో చివ్వెంల-ముకుందాపురం రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎస్) మండలం ముకుడుదేవులపల్లి గ్రామానికి చెందిన మందడి ఉదయ్ కిరణ్‌రెడ్డి (19) ఆత్మకూర్(ఎస్) మండలం నసీంపేట గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి మండలంలోని బీబీగూడెం గ్రామానికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు కాగా ఉదయ్‌కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

కోదాడ రూరల్ : బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఫెన్సింగ్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. కోదాడ పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన చింతా నవీన్ (20) తన స్నేహితుడు రాముతో కలిసి హుజూర్‌నగర్ రోడ్డులోని దాబాకు వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి బంజారాకాలనీ శివారులోని వెంచర్ వద్దకు వెళ్తూ ప్రమాదవశాత్తు వీరి బైక్ అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న ఫెన్సింగ్ స్తంభాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతిచెందగా రాముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. నవీన్ మృతదేహానికి కోదాడ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆంజనేయుడు తెలిపారు.

మహబూబ్‌నగర్ ఎస్పీకి మంత్రి పరామర్శ


మారయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

చందూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహాగౌడ్ తండ్రి మారయ్య (75) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబాన్ని ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్ తదితరులు పరామర్శించి మారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. ఒకరి మృతి


కారింగుల శ్రీను (ఫైల్)

గరిడేపల్లి : బైక్‌ను డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారింగుల శ్రీను (45) బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మండలంలోని పొనుగోడు గ్రామశివారులో గరిడేపల్లి నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న డీసీఎం బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో పొనుగోడు నుంచి గరిడేపల్లి వైపు వస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి వెంటనే కారు దిగి గాయాలతో పడి ఉన్న శ్రీనును అంబులెన్స్ పిలిపించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళా రైతు మృతి


రంగమ్మ (ఫైల్)

అర్వపల్లి : పిడుగుపాటుకు ఓ మహిళా రైతు మృతిచెందింది. ఈ సంఘటన జాజిరెడ్డిగూడెం మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నాన్యతండా ఆవాసం పూర్యానాయక్‌తండాకు చెందిన కేలోతు రంగమ్మ(45) ఆదివారం గొర్రెలను తోలుకొని బావి వద్దకు వెళ్లింది. సాయంత్రం ఉరుములు, మెరుపులు రావడంతో వర్షం వస్తుందేమోనని పొలంలో కోసి కుప్ప పోసిన ధాన్యం రాశిపై పట్టా కప్పుతుండగా ఒక్కసారిగా ఆమెపై పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శెవులు సమీపంలోని పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారుగా 25సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని ఓ యువకుడు చౌటుప్పల్‌లోని శ్రీని పరిశ్రమ వైపు వెళ్లేందుకు ఎస్‌హెచ్-9 హోటల్ ఎదుట హైవే రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో అతివేగంగా హైదరాబాద్ వైపుకు వెళ్తున్న మియాపూర్ డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచారు. ఎస్‌ఐ అనిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి వివరాలు మాత్రం తెలియరాలేదు. పరిశ్రమలో పనిచేసే కార్మికుడిగా భావిస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మోత్కూరు : ఓ మహిళ అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గాంధీనగర్ కాలనీకి చెందిన మేడి పద్మ (35) కొన్నేళ్లుగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. పద్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఒంటరిగా ఉంటున్న ఆమె ఆకస్మికంగా మృతి చెందడంతో పలు అనుమానాలకు తావిస్తోందని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్‌కు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరగనున్న అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు ఏర్పాట్లు పూర్తి అయినట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ తెలిపారు. ఆదివారం సమావేశ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం, పంటలకు గిట్టుబాటు ధర కోసం అనేక ఉద్యమాలు నిర్మించడానికి ఈ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, పోలేబోయిన కిరణ్, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ వాస్తవ చరిత్రను తెలుసుకోవాలి

- ప్రొఫెసర్ అన్నదానం సుబ్రహ్మణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

సూర్యాపేట : తెలంగాణ వాస్తవ చరిత్రను తెలుసుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని ప్రొఫెసర్ అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని జమ్మిగడ్డలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ సంస్థానానికి విముక్తి రాలేదన్నారు. నాటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలో కారణంగా 7వ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ దిగివచ్చి సెప్టెంబర్ 17,1948లో హైదరాబాద్ స్టేట్‌ను భారతదేశంలో విలీనం చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా చరిత్ర వాస్తవికతను తెలిపే 'నిప్పులాంటి నిజాలు' పుస్తకావిష్కరణ చేసి, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, బాధ్యులు తోట శ్యామ్ ప్రసాద్, గార్లపాటి వెంకటయ్య, పర్వతం శ్రీధర్, గజ్జెల వెంకట్ రెడ్డి, గట్ల సోమయ్య, విద్యాసాగర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- పోలీస్ కిష్టయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గొంగిడి సునీత, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్


కొలనుపాకలో కిష్టయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత, బండ ప్రకాష్

ఆలేరురూరల్ : ఆత్మబలిదానాలు చేసుకున్న కిష్టయ్య ఆశయాలు నేరవేరే విధంగా ప్రభుత్వం పేద వర్గాలు కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆదివారం మండలంలోని కొలనుపాకలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని మొదటి సారిగా ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి స్థానంలోనే పోలీస్ కిష్టయ్యను తొలి అమరవీరుడుగా గుర్తించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుదుల నగేష్, సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్, ఎంపీటీ అశోక్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొలుపు హరినాథ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, కొలనుపాక ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సిద్దులు, శంకరయ్య, నరేందర్, సిద్దిరాములు, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

25న వంగపల్లిలో బీఆర్‌ఎస్ ప్లీనరీ

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి గ్రామంలో ఈనెల 25న బీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వంగపల్లి గ్రామంలోని సభ నిర్వహించే ఫంక్షన్‌హాల్‌ను ఆమె ఆదివారం పరిశీలించారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, తరలిరావాలని కోరారు. ఆమె వెంట ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్, జిల్లా ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షులు రేపాక స్వామి, కానుగు రాజీవ్ గౌడ్, హబీబ్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.